# News Paper Items on IRC 77 Hyderabad Opening Ceremony

**In Namaste Telangana :**




గురువారం హైదరాబాద్ హెచ్ఐసీసీలో ప్రారంభమైన ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ 77వ సదస్సు ప్రారంభోత్సవం సందర్భంగా బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఐఆర్సీ ప్రతినిధులు

# ఐఆర్సీ సదస్సు తెలంగాణ కీర్తిని చాటాలి

జాతీయస్థాయి ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్సీ) సదస్సు హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల టెక్నికల్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్సీ) సదస్సు తెలంగాణ కీర్తిని దేశ నలుమూలలా చాటాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆకాంక్షించారు. సదస్సులో జరిగిన చర్చలు, తీసుకునే నిర్ణయాలు భావితరాలకు బాసటగా నిలువాలన్నారు. గురువారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో 77వ ఐఆర్సీ సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టెక్నికల్ ఎగ్జిబిషన్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు రోజులపాటు జరిగే సదస్సులో చేసే తీర్మానాలు నిర్మాణ రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తాయన్నారు. సదస్సును ఘనంగా నిర్వహించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. అనంతరం రాష్ట్రంలో నిర్మించిన రోడ్లు, భవనాలు, వంతెనలతో కూడిన బుక్‌లెట్‌ను మంత్రి విడుదల చేశారు. సదస్సుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారని ఐఆర్సీ అధ్యక్షుడు ఎస్ఎస్ పోర్వాల్ కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా ఐఆర్సీ సదస్సు నిర్వహిస్తున్న తీరు అభినందనీయమన్నారు. టీఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రెటరీ సునీల్‌శర్మ మాట్లాడుతూ, రాష్ట్రం ఏర్పడిన రెండున్నరేండ్లలోనే తెలంగాణ అద్భుత ప్రగతి సాధించిందన్నారు. ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీలు బిక్షపతి, గణపతిరెడ్డి, రవీందర్‌రావు రాష్ట్రంలో చేపట్టిన రోడ్లు, భవనాలు, వంతెన నిర్మాణాలపై వివరించారు.

**ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు**

సదస్సులో పాల్గొనేందుకు 2వేల మంది ప్రతినిధులు వచ్చారు. హైటెక్స్‌లో వివిధ రంగాల వ్యాపార, వాణిజ్య సంస్థలు ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేశాయి. సదస్సులో ఏర్పాటు చేసిన తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అమితంగా ఆకట్టుకున్నాయి. కాకతీయ తోరణం, తెలంగాణ తల్లి విగ్రహం ఐఆర్సీ వేదికకు హైలెట్‌గా నిలిచింది. కార్యక్రమంలో పంచాయత్‌రాజ్ ఈఎన్‌సీ సత్యనారాయణరెడ్డి, ఆర్‌అండ్‌బీ సీఈలు చంద్రశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్, మహేందర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
Fri, 16 December 2016
epaper.namasthetelangaana.com//c/15397743

## In Eenadu

# విదేశాలకంటే మిన్నగా తెలంగాణ రహదారులు

## ఐఆర్‌సీ సమావేశంలో మంత్రి తుమ్మల



సావనీర్‌ను విడుదల చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. చిత్రంలో ఐఆర్‌సీ అధ్యక్షుడు ఎస్ఎస్ పొర్వాల్, రభశా ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఇతర దేశాలలోని రహదారుల కంటే మిన్నగా తెలంగాణలో రోడ్లు ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం హైదరాబాద్ హైటెక్స్‌లో 'ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్(ఐఆర్‌సీ)' 77 వార్షిక సమావేశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం రహదారుల కోసం గడిచిన రెండేళ్లలో రూ.12,500 కోట్లను కేటాయించిందన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరుకానున్నారని చెప్పారు. రహదారుల నిర్మాణంలో వస్తున్న ఆధునిక పరిజ్ఞానం, సాంకేతిక విషయాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఆయా రాష్ట్రాల నిపుణుల సూచనలను, సలహాలను స్వీకరించి రహదారులను మరింత మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణ ప్రభుత్వం రెండున్నరేళ్లలో చేపట్టిన రహదారులు, భవనాలు, వంతెనలకు సంబంధించిన చిత్రాలతో కూడిన పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. అంతకు ముందు ఐఆర్‌సీ సమావేశంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను ప్రారంభించారు. రహదారులు, భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ, ఐఆర్‌సీ అధ్యక్షులు ఎస్.ఎస్.పొర్వాల్ పాల్గొన్నారు.

## In Andhra Jyothi :



హైటెక్స్‌లో సైకిల్ ఎక్కి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన మంత్రి తుమ్మల

# సాఫీగా సురక్షితంగా రహదారులు

- ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ ప్రారంభించిన తుమ్మల

హైదరాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాద రహితంగానూ, సాఫీగా, సురక్షితమైన రహదారుల నిర్మాణానికి నూతన సాంకేతికతను వినియోగించుకోవాలని రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. 'ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్' (ఐఆర్‌సీ) 77వ సదస్సును మంత్రి గురువారం హైటెక్స్‌లో ప్రారంభించారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి రూ.12,500 కోట్లు మంజూరు చేశామన్నారు. సదస్సులో సాంకేతిక ప్రదర్శనను ప్రారంభించారు. ఓ స్టాల్‌లో బ్యాటరీ సైకిల్‌పై కాసేపు రైడ్ చేశారు.

ఆంధ్రజ్యోతి Fri, 16 December 2016
epaper.andhrajyothy.com//c/15397829

## In Nava Telangana :

# రూ.12,500 కోట్లతో రోడ్ల నిర్మాణం

**రోడ్ కాంగ్రెస్‌లో మంత్రి తుమ్మల**

- ప్రమాణాల కోసం కాంట్రాక్టర్లు, ఇంజినీర్లపై ఒత్తిడి చేస్తున్నామని వ్యాఖ్య
- జాతీయ సాంకేతిక సదస్సు ప్రారంభం



స్టాళ్లను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

రాష్ట్రవ్యాప్తంగా రూ.12,500 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. కృష్ణా, గోదావరి నదులపై బ్రిడ్జిలు నిర్మించేందుకు ప్రభుత్వం ఇప్పటికే పరిపాలనపరమైన అనుమతులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. జాతీయ స్థాయి ప్రమాణాల కంటే మెరుగ్గా రోడ్ల నిర్మాణం ఉండేందుకు చర్యలు తీసుకున్నామని వ్యాఖ్యానించారు. ఇందుకోసం కాంట్రాక్టర్లు, ఇంజినీర్లపై ఒత్తిడి చేస్తున్నామని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ 77వ జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈసందర్భంగా దేశ, విదేశాల నుంచి వచ్చిన ఆయా కంపెనీలకు చెందిన స్టాళ్లను, ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం జరిగిన సాంకేతిక సదస్సులో మాట్లాడుతూ ఈ సదస్సులో రోడ్ల నిర్మాణానికి సంబంధించిన అనేక అంశాలపై విపులంగా చర్చలు జరగాలని సూచించారు. విజ్ఞానం, చర్చలతోనే మంచి ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. సున్నితమైన రోడ్లే కాకుండా భద్రతకు అనువుగా ఉండే నిర్మాణం అవసరమని చెప్పారు. ఇతర దేశాల కన్నా మన రోడ్లు బాగా నిర్మించేలా ఈ నాలుగురోజుల పాటు జరిగే సదస్సుల్లో సమాలోచనలు చేయాలని కోరారు. రెండు, నాలుగు లైన్ల రోడ్ల నిర్మాణానికి సైతం సర్కారు చర్యలు తీసుకుందని వివరించారు. ఈ సాంకేతిక జాతీయ సదస్సుకు 26 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు రావడం మంచి పరిణామమని తెలిపారు. కేంద్ర మంత్రి గడ్కరీ, ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం ఈ సదస్సుకు వస్తారని చెప్పారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఎస్.ఎస్ పోర్వాల్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా సదస్సుకు ఏర్పాట్లు చేశారంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు తెలంగాణ ప్రభుత్వానికి దన్యవాదాలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. రోడ్లు, భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి టీఆర్ఎస్‌జీ సునీల్ శర్మ, ఆ శాఖ ఇంజనీర్ ఇన్ ఛీఫ్ బిక్షపతి మాట్లాడుతూ రెండు వేల మంది సదస్సులో పాల్గొనేలా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల జాతీయ గ్రామీణ రోడ్ల విభాగం, తెలంగాణ ప్రభుత్వ స్టాల్, పంచాయతీరాజ్, రోడ్లు, భవనాల శాఖ స్టాల్‌ను, ఇతర ప్రయివేటు కంపెనీల స్టాళ్లను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అంతకుముందు వేదికపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఇప్పటి వరకు చేపట్టిన కార్యకలాపాలతో కూడిన హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజినీర్ శాఖ ఇంజినీర్ ఇన్ ఛీఫ్ సత్యనారాయణరెడ్డితోపాటు ఇతర శాఖల ఇంజినీర్ ఇన్ ఛీఫ్‌లు రవీందర్‌రావు, గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
Fri, 16 December 2016
epaper.navatelangana.com//c/15398082

## In Sakshi :

# దేశ పురోగతికి 'మార్గం': తుమ్మల

- హైటెక్స్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సు ప్రారంభం
- మెరుగైన రోడ్ల నిర్మాణానికి సదస్సు దోహదపడుతుందని ఆశాభావం




గురువారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగిన 77వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ ప్రారంభోత్సవంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సులో తీసుకునే నిర్ణయాలు దేశానికి ప్రయోజనకరంగా మారతాయని రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. రోడ్ల వంటి మౌలిక వసతులు మెరుగ్గా ఉన్నప్పుడే దేశ పురోగతికి మార్గం సుగమమవుతుందని చెప్పారు. రోడ్ల నిర్మాణంలో కొత్తపుంతలు తొక్కించే నిర్ణయాలు తీసుకునేందుకు ఇండియన్ రోడ్ కాంగ్రెస్ వేదిక కానుందన్నారు. 77వ రోడ్ కాంగ్రెస్ సదస్సును గురువారం హైటెక్స్‌లో తుమ్మల ప్రారంభించారు. రెండున్నరేళ్ల అనతికాలంలోనే తెలంగాణ పురోగతి మార్గంలో ఎంతో ముందుకెళ్లిందని, ఇందులో మెరుగైన రోడ్ల నిర్మాణం కూడా భాగమని తుమ్మల చెప్పారు. తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందాలంటే నాణ్యమైన రోడ్లు ఉండాలని గుర్తించిన సీఎం చంద్రశేఖరరావు రోడ్ల నిర్మాణానికి దాదాపు రూ.12,500 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. అంత మొత్తాన్ని ఖర్చు చేస్తున్నందున రోడ్ల నిర్మాణం మరింత మెరుగ్గా ఉండేందుకు ఈ సదస్సులో తీసుకునే నిర్ణయాలు దోహదపడుతాయని చెప్పారు. రోడ్లు మాత్రమే కాకుండా వాగులు, వంకలు, నదులపై వంతెనలు నిర్మిస్తున్నామని, నీటి నిల్వకు ఉపయోగపడేలా చెక్‌డ్యాం నమూనాలో రోడ్లను నిర్మిస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సు నిర్వహించే అవకాశం రావడం గర్వ కారణమని, ఇప్పటివరకు ఏ సదస్సు జరగని రీతిలో ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అంతర్జాతీయంగా రోడ్ల నిర్మాణంలో వస్తున్న కొత్త పద్ధతులు, విధానాలపై అవగాహన పెంచుకోవటానికి ఈ సదస్సు దోహదపడుతుందని ఇండియన్ రోడ్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోర్‌వాల్ పేర్కొన్నారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ఈఎన్‌సీలు భిక్షపతి, రవీందర్‌రావు, గణపతిరెడ్డి పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న ఉత్పత్తుల ప్రదర్శన..**

రోడ్ల నిర్మాణానికి ఉపయోగపడే వివిధ అంశాలతో కూడిన ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. వివిధ ఉత్పత్తులను ఆయా సంస్థలు ప్రదర్శించాయి. హైటెక్స్ రెండో స్టాల్‌ను ఇందుకు కేటాయించారు. టెక్నికల్ సెషన్ ప్రారంభానికి ముందు తుమ్మల ఈ ప్రదర్శనను ప్రారంభించారు. కాంక్రీట్ మిక్స్, రోడ్లపై గుర్తులు గీసేందుకు వినియోగించే రంగులు, స్పీడ్ బ్రేకర్ల వద్ద బ్లింకర్స్, తారు కలిపే యంత్రాలు సెన్సార్ల ద్వారా తారు, కాంక్రీట్ కలిపే భారీ యంత్రాలు, టిప్పర్లు వంటి ఉత్పత్తులు ప్రదర్శనకు ఉంచారు. శుక్రవారం జరిగే టెక్నికల్ సెషన్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌చంద్ర ప్రారంభిస్తారు.

సాక్షి
Fri, 16 December 2016
epaper.sakshi.com//c/15398020

**In Times of India :**




Minister for Roads and Buildings Tummala Nageswara Rao inspects a redesigned milestone at the inauguration of the 77th session of the Indian Roads Congress at Hitex on Thursday